క్లుప్తంగా

మెనూ తప్పక పాటించాలి



అచ్చంపేట: ప్రభుత్వం నిర్దేశించిన విధంగా మెనూ ప్రకారం భోజనం అందించాలని ఎంపీపీ స్వర్ణమ్మబాయి తెలిపారు. స్థానిక కస్తూరిబా బాలిక విద్యాలయ వంట ఏజన్సీలకు ఈ మేరకు సూచించారు. సోమవారం ఆమె పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థులను అడిగి వివరాలను తెలుసుకున్నారు. వంటశాల పరిసరాలను పరిశీలించి పరిశుభ్రంగా ఉంచాలన్నారు. విద్యార్థులతో సహపంక్తి భోజనం చేశారు. పాఠశాల ఎస్‌వో జోత్స్నతో మాటాడి విద్యార్థులకు ఆహారాన్ని అందించడంలో రాజీ పడొద్దని సూచించారు. ఆమె వెంట్ రమేష్ నాయక్ ఉన్నారు.

పేదలను ఆదుకున్న వెలుగూరి



సత్తెనపల్లి: పేదలకు వెలుగూరి వెంకటేశ్వర్లు చేసిన సేవలు వెలకట్టలేనివి అని, సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. ఏరియా ప్రభుత్వ వైద్యశాల పక్కన ఉన్న వెంకటేశ్వర్లు విగ్రహానికి ఆర్య వైశ్య చలివేంద్ర సంఘం ఆధ్వర్యంలో 53 వర్ధంతి సందర్భంగా సోమవారం గజమాల వేసి ఎమ్మెల్యే నివాళులు అర్పించారు. దివ్యాంగుడు అయినవోలు శ్రీనివాసరావుకు ట్రై సైకిల్‌ను, నిరుపేద మహిళకు వెట్ గ్రైండర్ అందించారు. వెలుగూరి శరత్ బాబు, జమిలి రాధా కృష్ణమూర్తి ధన్యవాదాలు తెలిపారు. స్థానిక నాయకులు పాల్గొన్నారు.

నట్టల నివారణ మందు పంపిణీ



అచ్చంపేట: గొర్రెలు, మేకల పెంపకందారులు తమ జీవాలకు తప్పనిసరిగా నట్టల నివారణ మందులు తాగించాలని పశువైద్యాధికారి డాక్టర్ స్వాతీదేవి తెలిపారు. మండలంలోని అచ్చంపేట, చామర్రు, కొత్తపల్లి, తాళ్లచెరువు, చిగురుపాడు గ్రామాలలో సోమవారం నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. ఈ నెల 10వ తేదీ వరకు మండలంలోని అన్ని గ్రామాలలో ఈ కార్యక్రమం కొనసాగుతుందని చెప్పారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కౌలు రైతులకు అవగాహన



రాజుపాలెం: దళత బహుజన రీసోర్స్‌సెంటర్ ఆధ్వర్యంలో ఏరియా కోఆర్డినేటర్ గడ్డిపర్తి కోటిరత్నం కౌలు రైతుల సమస్యల పరిష్కారానికి ఆటో ద్వారా సోమవారం ప్రచారం నిర్వహించారు. తహసీల్దారు కార్యాలయం నుంచి దీనిని ప్రారంభించారు. ఇన్‌చార్జి తహసీల్దారు జానీబాషా, సీనియర్ అసిస్టెంట్ కవిత, జూనియర్ అసిస్టెంట్ కప్పిరెడ్డిలు మాట్లాడారు. ఆటో ప్రచారం సుమారు ఆరు గ్రామాలలో నిర్వహించారు.

అటవీ మార్గం పునరుద్ధరించాలని వినతి



అచ్చంపేట: మండలంలోని పుట్లగూడెం నుంచి బెల్లంకొండ మండలం వెంకటాయపాలెం గ్రామం వరకు అడవిలో నుంచి గతంలో ఉన్న రోడ్డును పునరుద్ధరించాలని ఉమ్మడి గుంటూరు జిల్లా కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ ఐ.కాశీవిశ్వనాథరాజును స్థానిక గిరిజన సంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం గుంటూరులో ఆయనతో సమావేశం అయ్యారు. మూసుకుపోయిన రోడ్డును పునరుద్ధరించాలని కోరారు. రికార్డులను పరిశీలించి చర్యలు తీసుకుంటామని ఐ.కాశీవిశ్వనాథరాజు తెలిపారు. జిల్లా ఫారెస్ట్ అధికారి కృష్ణవేణి, ఇతర ఫారెస్ట్ అధికారులతో మాట్లాడి వెంటనే రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపడతామన్నారు. అఖిల భారత గిరిజన వికాస పరిషత్ అధ్యక్ష, కార్యదర్శులు బీటీ నాయక్, భూక్యా రమేష్‌నాయక్, వెంకటాయపాలెం సర్పంచ్ శ్రీనివాస‌నాయక్, మాజీ సర్పంచ్ మేకం శ్రీరామమూర్తి, అచ్చంపేట మండల ఆర్యవైశ్య సంఘ నాయకులు దేవరశెట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కుంకలగుంట.. సమస్యల తంటా!

- ప్రారంభానికి ముందే అధ్వానంగా మారిన రైల్వేస్టేషన్
- ప్లాట్‌ఫాంతోపాటు మెట్ల మార్గం, వెయిటింగ్ హాల్‌లోనూ చెత్తకుప్పలు
- ఈ నెల 4వ తేదీన ఇక్కడి నుంచి నడవనున్న తొలి పాసింజర్ రైలు



అధ్వానంగా స్టేషన్‌కు వెళ్లే ప్రధాన మార్గం

నకరికల్లు : ప్రారంభానికి ముందే మండలంలోని కుంకలగుంటలోని రైల్వేస్టేషన్ అధ్వానంగా మారింది. నడికుడి – శ్రీకాళహస్తి రైల్వేలైను ఏర్పాటులో భాగంగా మండలంలోని కుంకలగుంట వద్ద రైల్వే స్టేషన్ నిర్మించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రైల్వే లైను, స్టేషన్‌ల నిర్మాణం పనులను వేగవంతంగా పూర్తిచేశారు. పలుమార్లు గూడ్స్ రైలు ట్రయల్ రన్ జరిగింది. జూలై 4న నాందేడ్–తిరుపతి పాసింజర్ రైలును ఈ మార్గంలో నడపనున్నారు. న్యూపిడుగురాళ్ల, నెమలిపురి, కుంకలగుంట, రొంపిచర్ల, శావల్యాపురం స్టేషన్ల మీదుగా ఈ రైలు వెళ్లనుంది. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో కుంకలగుంట రానుంది.

కనీస వసతులూ కరువు

మండలంలోని కుంకలగుంట గుండా ప్రయాణికుల రైలు తొలిసారిగా వెళ్లనున్న నేపథ్యంలో అధికారులు కనీస ఏర్పాట్లు చేయలేదని స్థానికులు వాపోతున్నారు. రైల్వేస్టేషన్ పరిస్థితి అధ్వానంగా మారింది. కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చిన నాటి నుంచి స్టేషన్ బాగోగులు పట్టించుకున్న పాపానపోలేదు. స్టేషన్ ప్రధాన భవనం చుట్టూ ముళ్లపొదలు పెరిగిపోయాయి. స్టేషన్‌లోకి ప్రవేశించే మెట్లమార్గం వద్ద పిచ్చిమొక్కలు అడ్డంగా మారాయి. మెట్లు కూడా ధ్వంసమయ్యాయి. ప్రయాణికులు వేచి ఉండే గదుల్లో చెత్త, మద్యం బాటిళ్లు పడేశారు. కిటికీల అద్దాలు ధ్వంసమై గదుల నిండా పడిపోయాయి. విద్యుత్‌బోర్డులు ఛగిలిపోయాయి. రెయిలింగ్ కూడా పూర్తిగా కంపచెట్లమయంగా మారింది. స్టేషన్ ప్రధాన ప్లాట్‌ఫాంపై పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. టైల్స్ ధ్వంసమయ్యాయి. తాగునీటి కొళాయిల పరిస్థితి చెప్పే పనే లేదు. కనీసం పట్టించుకునే నాథులే కరువయ్యారు. ఇప్పటికైనా స్పందించి స్టేషన్‌ను, పరిసరాలను శుభ్రం చేయించాలని స్థానికులు కోరుతున్నారు. అవసరమైన మరమ్మతులు చేయించాలని డిమాండ్ చేస్తున్నారు.

రెండు మండలాల వారికి ప్రయోజనం

నకరికల్లు మండలంలోని కుంకలగుంట, చేజర్ల, పాపిశెట్టిపాలెం, జిల్లాపేటతండా గ్రామాలతో పాటు రొంపిచర్ల మండలంలోని విప్పర్ల, రెడ్డిపాలెం, దాసరిపాలెం, గుడిపాడు తదితర గ్రామాలకూ ఈ స్టేషన్ సమీపంలో ఉంది. హాల్ట్ స్టేషన్ అయిన కుంకలగుంట స్టేషన్‌ను సక్రమంగా నిర్వహిస్తే ఆయా గ్రామాల ప్రజలకు రైల్వే సేవలు అందుతాయి.



ప్లాట్‌ఫాంపై పెరిగిన పిచ్చి మొక్కలు



ప్రాంగణంలో పేరుకుపోయిన చెత్త

దాడులకు పాల్పడిన వారిని శిక్షించాలి

అచ్చంపేట: సత్తెనపల్లిలోని వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో పురోహితులుగా పనిచేస్తున్న సాయికృష్ణశాస్త్రిపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని అచ్చంపేట మండల బ్రాహ్మణ ఐక్యవేదిక ప్రతినిధులు డిమాండ్ చేశారు. సభ్యుడు అనిల్ శాస్త్రి మాట్లాడుతూ దేవస్థాన కమిటీకి చెందిన ఒక వ్యక్తి మాట్లాడాలని పిలిచి దాడికి పాల్పడటం అమానుషం అన్నారు. దీనిపై సత్తెనపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో సాది శివప్రసాద్, కల్వకలను సీతారామశాస్త్రి, విష్ణు, జగన్, నారపరాజు నాగభూషణం, మద్దాలి అనిల్‌కుమార్, రాజశేఖరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పరిమితికి మించి విద్యార్థులను వాహనాల్లో ఎక్కించరాదు

గురజాల: పాఠశాలల కింద నడిపే వాహనాల్లో పరిమితికి మించి విద్యార్థులను ఎక్కించరాదని మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ డి.శేషురెడ్డి అన్నారు. స్థానిక దండివాగు సమీపంలో సోమవారం వాహనాలను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ 15 సంవత్సరాలు దాటిన బస్సులను పాఠశాలల్లో విద్యార్థులను తీసుకువెళ్లేందుకు ఉపయోగించరాదని చెప్పారు. ఆ బస్సులను వెంటనే సీజ్ చేస్తామన్నారు. ప్రతి పాఠశబూల బస్సుకు తప్పనిసరిగా డ్రైవర్‌తో పాటు క్లీనర్ కూడా ఉండాలన్నారు. వారు యూనిఫాం ధరించాలని బస్సులో విధిగా ఫస్ట్ ఎయిడ్ కిట్, ఫైర్ బాక్స్ అందుబాటులో ఉంచాలని కోరారు. తప్పనిసరిగా బస్సు తిరిగే రూట్ వివరాలతో పాటు విద్యార్థుల పేరు, తండ్రి పేరు, సెల్ నంబరు ఉండాలన్నారు. ఆటోల్లో విద్యార్థులకు కేవలం ఆరుగురికి మాత్రమే పరిమితం కావాలన్నారు.

సీజీజీబీ ఆర్‌ఎం హామీతో ఆందోళన విరమణ



అధికారులతో మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా కార్యదర్శి వై.గోపాలరావు

దొడ్లేరు(క్రోసూరు): దొడ్లేరు చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు గోల్డ్ లోన్ బాధితులు రైతు, కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన ఆందోళన కార్యక్రమం మూడో రోజు సోమవారం కూడా కొనసాగింది. నిరసన దీక్ష, బ్యాంకు ముట్టడి చేపట్టటంతో రీజినల్ మేనేజర్ వచ్చి హామీ ఇచ్చారు. దీంతో ఆందోళన విరమించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి వై.గోపాలరావు మాట్లాడుతూ బాధిత రైతులు శాంతియుతంగా నిరసన దీక్షలు చేస్తున్నప్పటికీ, కనీసం సమస్య ఏంటని బ్రాంచ్ మేనేజర్ శివశంకర్ నాయక్ అడగకపోవడంతో రైతులు ఆందోళన చేయడం జరిగిందన్నారు. ఈ సమస్య రెండు సంవత్సరాలుగా ఉన్నప్పటికీ పరిష్కారం కాకపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత రైతులందరికీ నిర్దిష్ట కాల పరిమితిలోగా న్యాయం చేయాలని అన్నారు. రీజినల్ మేనేజర్‌తో రైతు సంఘం నాయకులను మేనేజరు మాట్లాడించారు. జూలై 4వ తేదీన సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని, రైతులు ఆందోళన విరమించాలని ఆర్‌ఎం కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో రైతు సంఘం పల్నాడు జిల్లా కమిటీ సభ్యుడు ఆవుల ఆంజనేయులు, తిమ్మిశెట్టి హనుమంతరావు, బాధిత రైతులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలివ్వాలి

- గృహ నిర్మాణాలూ చేపట్టాలి
- సీపీఐ ఆధ్వర్యంలో ర్యాలీ



తహసీల్దార్ వీవీ నాగరాజుకు అర్జీలు అందిస్తున్న సీపీఐ నాయకులు, పేదలు

క్రోసూరు: ఎన్నికల సందర్భంలో కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలలో భాగంగానిరుపేదలకు నివేశ స్థలాలిచ్చి గృహ నిర్మాణాన్ని ప్రభుత్వమే చేపట్టాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ వీవీ నాగరాజుకుకు అర్జీలను అందచేశారు. ఈ సందర్భంగా జిల్లా సీపీఐ కార్యవర్గ సభ్యులు భైరవపట్నం రామకృష్ణ, పెదకూరపాడు నియోజకవర్గ కార్యదర్శి మునగోటి శ్రీనివాసరావులు మాట్లాడుతూ.. క్రోసూరు సహా వివిధ గ్రామాలలో నివేశ స్థలాలు లేని నిరుపేదలు ఉన్నట్లు గుర్తించామన్నారు. అర్హత కలిగి ఉన్నా కొందరు నిజమైన లబ్ధిదారులను ప్రభుత్వపరంగా రీసర్వే పింఛను అందడం లేదన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి పోతుగంటి నాగేశ్వరరావు, రైతు సంఘం కార్యదర్శి కంచేటి పెద్దబ్బాయి, పట్టణ కార్యదర్శి యాదగిరి, కాళిదాసు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సబ్సిడీపై సాగు పరికరాలు పంపిణీ



ముప్పాళ్ళలో డ్రోన్ అందిస్తున్న దృశ్యం

ముప్పాళ్ళ: రైతులకు సబ్సిడీపై వ్యవసాయ పరికరాలను అందించారు. ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ సోమవారం వీటిని పంపిణీ చేశారు. మండలంలోని చాగంటివారిపాలెం గ్రామంలో ఈ కార్యక్రమం జరిగింది. సబ్సిడీ డ్రోన్‌కు ఇరుకుపాలెం గ్రామానికి చెందిన చంద్రబోస్, బొల్లవరం గ్రామానికి చెందిన సిద్ధివిఘ్నేశ్వర గ్రూప్‌లు ఎంపికైనట్లు చెప్పారు. వారికి డ్రోన్లు అందించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దరువూరి నాగేశ్వరరావు, బత్తుల నాగేశ్వరరావు, మాజీ ఎంపీపీ గోగినేని కోటేశ్వరరావు, మండల వ్యవసాయాధికారి శ్రీధరరెడ్డి పాల్గొన్నారు.

అలాగే మండలంలోని గోళ్ళపాడు గ్రామంలో గల కేజీబీవీ పాఠశాలలో జూనియర్ కళాశాల భవనాల నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. దాదాపు రూ.2 కోట్లతో అదనపు తరగతి గదులు నిర్మాణం చేపట్టనున్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గోపు అప్పమ్మ తదితరులు పాల్గొన్నారు.

సమ్మెను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న గుంటూరు మల్లేశ్వరి

సత్తెనపల్లి: కేంద్ర ప్రభుత్వం కార్మికులకు ద్రోహం చేసిందని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సీఐటీయూ పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు మల్లేశ్వరి పేర్కొన్నారు. స్థానిక పుతుంబాక భవన్‌లో సోమవారం జరిగిన అంగన్‌వాడీ వర్కర్స్ విస్తృత స్థాయి సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా మాట్లాడుతూ కార్మిక వ్యతిరేక నాలుగు రకాల లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని ఈనెల 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. గత వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ ప్రభుత్వం హయాంలో అంగన్‌వాడీలు 42 రోజులు సమ్మె చేసి అప్పటి రాష్ట్ర ప్రభుత్వంతో కొన్ని డిమాండ్లు సాధించి ఒప్పందం చేసుకున్నారని గుర్తు చేశారు. సమ్మె కాలపు ఒప్పందం ప్రకారం ప్రస్తుత కూటమి ప్రభుత్వం జీవో తీసుకువచ్చి అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎస్.కె. సుజాత, సీఐటీయూ సత్తెనపల్లి మండల కార్యదర్శి పెండ్యాల మహేష్, అంగన్‌వాడీ ప్రాజెక్టు అధ్యక్షులు ఎస్.అహల్య, సెక్టార్ లీడర్లు అంజనీ, జ్యోతి, ప్రభావతి, కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి ఎంతో ఉన్నతం



సీతారామిరెడ్డిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ముప్పాళ్ళ: సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఎంతో ఉన్నతమైనదని జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ చెప్పారు. మండల విద్యావనరుల కేంద్రంలో ఎంఈఓ ఎం.సీతారామిరెడ్డి పదవీ విరమణ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ ఉపాధ్యాయుడిగా విధుల్లో చేరి మండల విద్యాశాఖాధికారిగా పదవీ విరమణ చేస్తున్న సీతారామిరెడ్డి సేవలు అభినందనీయం అన్నారు. ఈ సందర్భంగా ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఓ కె.శ్రీనివాసరావు, రాఘవేంద్రరావు, ఉపాధ్యాయులు, ఎంఈఓ కార్యాలయ సిబ్బంది, ఐఈడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సొమ్ము దుర్వినియోగం చేస్తారా?

- మురికివాడలను విస్మరించి ఇళ్లు లేని చోట్ల రహదారుల నిర్మాణమా?
- ఎస్సీ, ఎస్టీల భూములను సైతం కబ్జా చేసేందుకు ప్రయత్నాలు
- రెండు వార్డులకే రూ. కోట్ల నిధులు కేటాయింపు
- మున్సిపల్ వైస్ చైర్మన్ రమావత్ కోటేశ్వరరావు నాయక్





మున్సిపల్ చైర్‌పర్సన్ చల్లంచర్ల లక్ష్మీతులసి, సమావేశంలో కౌన్సిలర్లు, కోఆప్షన్ మెంబర్లు

సత్తెనపల్లి: పట్టణ శివారులో ప్రజలు నివాసం లేని ప్రాంతాలకు నిధులను కేటాయించి ప్రజల సొమ్మును దుర్వినియోగం చేస్తారా అని మున్సిపల్ వైస్ చైర్మన్ రమావత్ కోటేశ్వర రావు నాయక్ మండిపడ్డారు. మున్సిపల్ కౌన్సిల్ సాధారణ, అత్యవసర సమావేశాలు మున్సిపల్ చైర్‌పర్సన్ చలంచర్ల లక్ష్మీతులసి అధ్యక్షతన సోమవారం జరిగాయి. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ మాట్లాడుతూ.. పట్టణంలో ప్రజలు నివసిస్తున్న ప్రాంతాల్లో సమస్యల పరిష్కారానికి నిధులు కేటాయించకుండా ఊరి చివర రోడ్లు వేయడం సరి కాదన్నారు. ఆ సమయంలో 19వ వార్డు కౌన్సిలర్ ఏ శ్రీనివాసరావు జోక్యం చేసుకొని మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు చెప్పారు. కనీస వసతులు అంటే ప్రజలు నివసించే చోట కల్పించాలని, ఊరి చివర ఎప్పుడో భవిష్యత్తులో ఇళ్ల నిర్మాణం చేపడతారని వెంచర్ల కోసం రోడ్లు వేయడం సరైన పద్ధతి కాదని వైస్ చైర్మన్ అన్నారు. పశువైద్యశాల నుంచి నరసరావుపేట రోడ్డు వరకు కచ్చా డ్రైయిన్‌కు మరిన్ని నిధులు కేటాయిస్తే వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు తగ్గుతాయన్నారు. నందిగామ డొంకలో రహదారి నిర్మాణానికి రూ. 1.50 కోట్లు కేటాయించటం ఏంటని ప్రశ్నించారు. అమరావతి మేజర్ కాలవ నుంచి రఘురాంనగర్ వరకు రూ. 21 లక్షలు కేటాయించారన్నారు.

ఆక్రమణలపై స్పందించని యంత్రాంగం

ఎస్సీ, ఎస్టీలకు నోరు లేదని 17వ వార్డులో 4.50 ఎకరాలను, రైల్వే స్టేషన్ రోడ్‌లో 1.50 ఎకరాలను ఆక్రమించడానికి ప్రయత్నాలు చేస్తున్నా అధికారులు స్పందించడం లేదన్నారు. డీకే పట్టాలున్న భూముల్లో వెంచర్లు వేస్తున్నా స్పందన లేదన్నారు. పట్టణంలో 9 వార్డులకు శ్మశాన వాటికలో షెడ్ ఏర్పాటుకు అంచనాలు వేయించినప్పటికీ ఏడాదైనా అతీగతీ లేదన్నారు. అనుకూలమైన రెండు వార్డులకు మాత్రమే రూ. 4 కోట్లకుపైగా నిధులు కేటాయించడంపై ప్రశ్నించారు.

మున్సిపల్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ రంగిశెట్టి సుమన్ కుమార్ మాట్లాడుతూ పట్టణంలో నో స్మోక్ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. రైల్వేస్టేషన్ రోడ్‌లోని టీటీడీ కల్యాణమండపం ఎదుట ప్రైవేట్ వ్యక్తి మున్సిపాలిటీ నుంచి తన స్థలాన్ని స్వాధీనం చేసుకొని ఫుడ్‌కోర్ట్ పెడుతుంటే అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. 4వ వార్డ్ కౌన్సిలర్ కటకం రామకృష్ణ మాట్లాడుతూ రైల్వే స్టేషన్ రోడ్‌లో క్రీడా ప్రాంగణాన్ని అభివృద్ధి చేసిన మాజీ స్పీకర్ డాక్టర్ కోడెల శివప్రసాదరావు పేరుకు బదులు ఆ క్రీడా ప్రాంగణానికి కన్నా లక్ష్మీనారాయణ పేరు పెట్టడం సరి కాదన్నారు. కౌన్సిలర్ రంగిశెట్టి సుమన్ కుమార్ అభ్యంతరం వ్యక్తం చేస్తూ... అది పెద్దలు మాట్లాడిన తర్వాత తీసుకున్న నిర్ణయం అని చెప్పారు. ఈ అంశానికి తాను డీసెంట్ ఇస్తున్నట్లు రామకృష్ణ ప్రకటించారు. డీసెంట్‌పై రంగిశెట్టి సుమన్ కుమార్, వైస్ చైర్మన్ రమావత్ కోటేశ్వరరావు నాయక్ కూడా సంతకాలు చేయటం గమనార్హం. 11వ వార్డు కౌన్సిలర్ గుజ్జర్లపూడి సతీష్ మాట్లాడుతూ పట్టణంలోని డివైడర్‌పై బోర్డులు ఎందుకు తొలగించారని ప్రశ్నించారు. టీపీఓ రాధాకృష్ణ మాట్లాడుతూ కొన్నింటికి అనుమతి లేదని, వాటినే తొలగించామన్నారు. కౌన్సిలర్ రంగిశెట్టి సుమన్ కుమార్ మాట్లాడుతూ డివైడర్ మధ్య పచ్చదనం పెంచాలన్నారు. కౌన్సిలర్ గుజ్జర్లపూడి సతీష్ మాట్లాడుతూ ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ నివాసముండే లైన్‌లో వారం రోజుల నుంచి ఇంటింటి చెత్త సేకరణ జరగడం లేదని పేర్కొన్నారు. ఇప్పటికే 30వ వార్డులో డెంగీ వచ్చిందని, వ్యాపించే వరకు పట్టించుకోరా అని ప్రశ్నించారు. వెంగళ్ళరెడ్డి నగర్‌కు రూ. 1.10 కోట్లతో ఓవర్ హెడ్ ట్యాంక్ మంజూరు అయిందని, దాని ప్రస్తుత పరిస్థితిని తెలియజేయాలన్నారు. అత్యవసర సమావేశ అజెండాలో 9వ అంశం మినహా మిగిలిన వాటిని ఆమోదించారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ నాగూర్‌మీరాన్, కమిషనర్ ఎన్.ఆనంద్ కుమార్, డీఈ మధుసూదన్‌రావు, కౌన్సిలర్లు, కో ఆప్షన్ మెంబర్లు, సెక్షన్ హెడ్లు, తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్‌లను అడ్డుకోండి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న విజయ్‌కుమార్, కమిటీ సభ్యులు

సత్తెనపల్లి: స్మార్ట్ విద్యుత్ మీటర్ బిగించడానికి వస్తున్న సిబ్బందిని అడ్డుకోవాలని సీపీఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్ అన్నారు. సోమవారం స్థానిక పుతుంబాక భవన్‌లో సీపీఎం పల్నాడు జిల్లా కమిటీ సభ్యులు స్మార్ట్ మీటర్‌లకు వ్యతిరేకంగా కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచితే ఆ ప్రభుత్వాన్ని బాదుడే బాదుడు అని ఊదరగొట్టిన అప్పటి ప్రతిపక్షంలో ఉన్న తెలుగుదేశం పార్టీ నేతలు, ఇప్పుడు రూ.15,485 కోట్లు సర్దుబాటు చార్జీల రూపంలో ప్రజలపై భారం వేశారని ఆరోపించారు. బడా కంపెనీల లాభాలతో అధినేతల జేబులు నింపుకోవడం కోసం ప్రజలపై విద్యుత్ బిల్లులు మోత వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. షాపులు, పరిశ్రమలకు యూనిట్‌కు ఆరు పైసలు ఉన్న విద్యుత్ సుంకాన్ని రూపాయికి పెంచారని, కూటమి ప్రభుత్వం దానికి చట్టబద్ధత కల్పించిందని విమర్శించారు. స్మార్ట్ విద్యుత్ మీటర్ల బిల్లులు ఆన్‌లైన్‌లో పంపుతారని పేర్కొన్నారు. మన ఇళ్లకు వచ్చి బిగించే అదానీ స్మార్ట్ మీటర్‌కు అయ్యే ఖర్చు రూ. 10 వేలు నుంచి రూ. 17 వేల వరకు ఉంటుందన్నారు. 93 నెలల్లో మీటరు అద్దె పేరుతో మన వద్ద ఈ డబ్బు మొత్తం నెలవారీ వాయిదాల్లో వసూలు చేస్తారని తెలిపారు. ఈ మీటర్లను బిగించడానికి వస్తే ఆ సిబ్బందిని అడ్డుకోవాలని, అండగా తాము ఉంటామని హామీ ఇచ్చారు.

మూడు ద్విచక్ర వాహనాలు స్వాధీనం

మాచర్ల రూరల్: పట్టణ పరిధిలోని ఇద్దరు దొంగలను అరెస్టు చేసి, వీరి నుంచి మూడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు గురజాల డీఎస్పీ బి.జగదీష్ తెలిపారు. రూరల్ పోలీసు స్టేషన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 27న మంజుల దాసు ఇంటి ముందు వాహనాన్ని పార్క్ చేయగా పోయిందని, ఆ మేరకు ఆదివారం ఫిర్యాదు చేశారన్నారు. అర్బన్ సీఐ ప్రభాకర్‌రావు, ఎస్ఐ జి.సంధ్యారాణి ఆధ్వర్యంలో రెండు టీమ్స్ 180 సీసీ కెమెరాల్లో పరిశీలించినట్లు చెప్పారు. మాచవరం మండలం, గంగిరెడ్డిపాలేనికి చెందిన మల్లెల దేవకుమార్, మందలపాటి గోపికృష్ణలను విచారించి, అరెస్టు చేసి వారి వద్ద నుంచి మూడు బైకులను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి రిమాండ్‌కు విధించినట్లు తెలిపారు.

అంకితభావంతో పని చేస్తే గుర్తింపు



శారదాదేవిని సన్మానిస్తున్న ఆర్ఐఓ సునీత తదితరులు

బెల్లంకొండ: విధులలో అంకితభావంతో పనిచేస్తే సమాజంలో గుర్తింపు లభిస్తుందని ఇంటర్మీడియట్ బోర్డు ఆర్ఐఓ, బెల్లంకొండ కళాశాల ప్రిన్సిపల్ గర్నెపూడి సునీత తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంగ్లిష్ లెక్చరర్‌గా పనిచేస్తున్న సీహెచ్ శారదాదేవి పదవీ విరమణ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఐఓ సునీత మాట్లాడుతూ.. విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దేందుకు శారదాదేవి ఎంతో కృషి చేశారని తెలిపారు. విధులలో ఉత్తమ నడవడికతో తోటి అధ్యాపకులకు ఆదర్శంగా నిలిచారని పేర్కొన్నారు. శారదా దేవిని కళాశాల అధ్యాపకులు, అధికారులు సత్కరించారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

దాచేపల్లి: విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. వివరాలు.. మండలం కొత్తూరు గ్రామానికి చెందిన మేడ సైదారావు పొలంలో విద్యుత్ పనులు చేసేందుకు వెళ్లాడు. పనులు చేస్తుండగా విద్యుత్ సరఫరా కావడంతో షాక్‌కు గురై శరీరం అంతా కాలింది. దీంతో సైదారావు అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల సమాచారంతో పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతుడికి భార్య, ఇరువురు సంతానం ఉన్నారు.